సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 4 । జూలై । 2025



ఇందూరు జిల్లా..

ఇందూరు జిల్లా క్రీడాకారులకు పుట్టినిల్లు అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు.

- 4లో ▸



శుభకార్యాలు చేసుకునేది..

టీటీడీ కల్యాణ మండపాల నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి.

- 4లో ▸

గరిష్టం/కనిష్టం
33.7 /22.8

వాతావరణం

ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న వారాహి నవరాత్రులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నగరంలోని అమ్మ వెంచర్‌లో నిర్మిస్తున్న శ్రీ వారాహి మాత ఆలయం వద్ద గత నెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ గుప్తా ఆధ్వర్యంలో ప్రతిరోజూ రాత్రి 7 నుంచి 9 గంటల వరకు అమ్మవారికి శోడశోపచార పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏటా ఆషాఢ శుద్ధ ప్రతిపద నుంచి ఆషాఢ శుద్ధ నవమి వరకు నవరాత్రి పూజలు నిర్వహించడం సంప్రదాయం. ప్రతిరోజూ పూజా కార్యక్రమాల అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పలుమార్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి ఎస్‌కే అనాస్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలోని నాగారంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నందిపేట సిద్ధార్థ పాఠశాలకు చెందిన ఎస్‌కే అనాస్ అండర్–14 విభాగంలోని బ్యాక్ త్రోలో బంగారు, లాంగ్‌జంప్‌లో వెండి, 60 మీటర్ల పరుగు పోటీలో వెండి పతకం సాధించాడు. దీంతో అనాస్‌ను జిల్లా అథ్లెటిక్ సంఘం రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. పాఠశాల కరస్పాండెంట్ దేవన్న, డైరెక్టర్ వంశీ, పీఈటీ రంజిత్, ఉపాధ్యాయులు అనాస్‌ను అభినందించారు.

జావెలిన్ త్రో పోటీలకు..




మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కంజర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న కుందెన్ సిద్ధాంత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గోపాలచారి తెలిపారు. నగరంలోని నాగారం రాజారాం స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాల నుంచి 16 మంది విద్యార్థులు పాల్గొనగా, అండర్–12 జావెలిన్ త్రో బాలుర విభాగంలో సిద్ధాంత్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 6న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన సిద్ధాంత్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, అరుణ శ్రీ, ఎంఎస్ రాణి, కాంతి కిరణ్, ఉమా గౌరి, భూమయ్య, విజయలక్ష్మి అభినందించారు.

నలుగురికి ఏడీఏలుగా పదోన్నతి

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న నలుగురు ఏవోలకు ఏడీఏలుగా పదోన్నతి లభించింది. పదోన్నతితోపాటు పోస్టింగులు ఇస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కార్యాలయంలో టెక్నికల్ విభాగంలో ఉన్న గోపికి మంచిర్యాల, శ్రీనివాస్‌కు ఆదిలాబాద్, రెంజల్ ఏవో శ్రీనివాస్ రావుకు కుమురం భీం, డిచ్‌పల్లి ఏవో సుధా మాధురికి ఎల్లారెడ్డి ఏడీఏగా పదోన్నతి పోస్టింగ్‌లు లభించాయి. పదోన్నతులు పొందిన అధికారులకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరాస్వామితోపాటు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సారెస్పీలోకి 8,718 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో




బాల్కొండ: శ్రీరాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి 8,718 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, ఆవిరి రూపంలో 304, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1065.90 (17.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

గెట్ అవుట్..!

జిల్లాలో పార్టీని అన్నీతానై నడిపిస్తున్నానని, అధినేత కుటుంబానికి వీరవిధేయుడినని తన వ్యవహార శైలితో సెల్ఫ్‌డబ్బా కొట్టుకునే జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేను బీఆర్‌ఎస్ అధినేత 'గెట్ అవుట్' అన్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అధికారంలో ఉన్న కాలంలో వివాదాలకు కేంద్రంగా ఉన్న ఆయన.. అధికారం దూరమైన తరువాత అంతకు మించి సెంటర్‌పాయింట్ అయ్యారు. తాజాగా ఆ మాజీ ప్రజాప్రతినిధిని బీఆర్‌ఎస్ అధినేత దూరంపెట్టినట్లు సమాచారం.

- జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేపై కేసీఆర్ కన్నెర్ర
- ఫామ్‌హౌస్ నుంచి బయటికి గెంటేసినట్లు ప్రచారం
- పార్టీ అంతర్గత వ్యవహారాలను కాంగ్రెస్‌కు చేరవేశాడనే ఆరోపణలు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వ్యవహారం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కేసీఆర్ కుటుంబానికి వీరవిధేయుడినని తనకుతాను ప్రచారం చేసుకునే ఓ మాజీ ఎమ్మెల్యేను 'గెట్ అవుట్' అంటూ బయటకు గెంటేసినట్లు వివిధ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఆ మాజీ.. అధికార పార్టీకి కోవర్టుగా మారి వెలగబెట్టిన వ్యవహారాలపై చర్చించుకుంటూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలే కాదు కేసీఆర్ సైతం విస్తుపోయినట్లు సమాచారం. కేసీఆర్ చరిష్మాతో వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సదరు నేత అధికారాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేశారని ఇప్పటికే అన్నివర్గాల్లో ఆగ్రహం ఉంది.

అయితే సదరు మాజీ ఎమ్మెల్యే వ్యవహారాలు, అతడిని ఫామ్‌హౌస్ నుంచి గెంటేసిన దానిపై సోషల్ మీడియాలోనూ చర్చ సాగు తోంది. అధికారంలో ఉన్న సమయంలో అడ్డూఅదుపు లేకుండా, రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తూ విచ్చలవిడిగా భూదందాలు, దౌర్జన్యాలకు పాల్పడిన అతడిని నియోజకవర్గ ప్రజలు ఎన్నికల్లో మూడోస్థానానికి పరిమితం చేశారు. ఇప్పటికీ ఆయన నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో తిరగలేని పరిస్థితి. అధికారం దూరమైన తరువాత ఏదో వచ్చామని చెప్పుకునేలా వేళ్లమీద లెక్కపెట్టేన్ని సార్లు మాత్రమే నియోజకవర్గానికి రావడం గమనార్హం. అయితే సదరు మాజీ ఎమ్మెల్యే ప్రతిరోజూ కేసీఆర్ కుటుంబంతో, ఫామ్‌హౌస్‌లో ఉంటున్నారని అంతా భావించారు. పరిస్థితి మాత్రం ఇందుకు విరుద్ధంగా ఎవరూ ఊహించని రీతిలో ఉండడంతో పార్టీ శ్రేణులు ఆశ్చర్యపోతున్నాయి.

కవిత ఓటమిలోనూ కీలక పాత్ర..!

తాజాగా కేసీఆర్ కన్నెర్రజేసి బయటకు వెళ్లగొట్టిన ఆ మాజీ ఎమ్మెల్యే.. ఎంపీగా కవిత ఓటమిపాలు కావడంలో కీలక పాత్ర పోషించినట్లు నాటి నుంచి చర్చ జరుగుతోంది. కవిత ఓటమి తరువాత హైదరాబాద్, గోవా, దుబాయ్‌లలో దావత్‌లు చేసుకున్నట్లు పలువురు కార్యకర్తలు చెబుతున్నారు. కవిత ఓటమిలో జిల్లాకు చెందిన మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు ఉండడం గమనార్హం.

పార్టీని గాలికొదిలేసి..

అధికారంలో ఉన్న సమయంలో ఎమ్మెల్యేలుగా అడ్డగోలు వ్యవహారాలు నడిపిన వారు ఓటమి తరువాత పార్టీని గాలికొదిలేశారని బీఆర్‌ఎస్ శ్రేణులు వాపోతున్నాయి. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయని గత కొంతకాలంగా కవిత ఆరోపణలు చేస్తున్నారు. ఓ మాజీ ఎమ్మెల్యే సీఎంఆర్ బియ్యం ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతుండగా, మూడో స్థానంతో ఓటమి పాలైన మరో మాజీ నియోజకవర్గానికి తూతూమంత్రంగా వచ్చి వెళ్తున్నాడని కార్యకర్తలు అంటున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని కౌంటర్ చేయడంలో మూడో స్థానంతో సరిపెట్టుకుని ఓటమిపాలైన ఆ మాజీ ఎమ్మెల్యే తనకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నాడని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎత్తిచూపేందుకు కనీసం ప్రెస్‌మీట్ సైతం పెట్టలేదని దీంతోపాటు అనేక అంశాలను కేసీఆర్ పరిశీలిస్తున్నారని వివిధ వర్గాల్లో చర్చ సాగుతోంది. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కౌంటర్ చేస్తుండడం ఇందుకు నిదర్శనమని బీఆర్‌ఎస్ కార్యకర్తలు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ కోవర్టు..

ఆ మాజీ ప్రజాప్రతినిధి నిత్యం కేసీఆర్‌తో, ఫామ్‌హౌస్‌లో ఉంటూనే పార్టీ అంతర్గత విషయాలు, వ్యవహారాలన్నింటినీ ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నిహితుడికి వాట్సాప్ ద్వారా చేరవేసినట్లు కేసీఆర్, కేటీఆర్ తెలుసుకున్నట్లు తెలిసింది. దీంతో కేసీఆర్ అతడిని ఫామ్‌హౌస్ నుంచి గెట్ అవుట్ అని గద్దించారని సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పార్టీ ప్రతి అంతర్గత వ్యవహారాన్ని పూసగుచ్చినట్లు కాంగ్రెస్ నాయకులకు చేరవేశాడని పలువురు కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో, హైదరాబాద్‌లో విచ్చలవిడిగా భూ ఆక్రమణలు, బెదిరింపులు, దౌర్జన్యాలు చేశాడని, అలాంటి వ్యక్తిని భవిష్యత్‌లో దరిదాపుల్లోకి రానివ్వొద్దని పలువురు కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. నియోజకవర్గంలో సైతం అభివృద్ధి పనుల పేరిట పలువురి వద్ద, అలాగే ఎన్‌ఆర్‌ఐల నుంచి అప్పు పేరుతో డబ్బులు తీసుకుని ఎగ్గొట్టినట్లు కథలుకథలుగా బయటకు వస్తున్నాయి. అధికారం ఉన్న సమయంలో అనేకమంది స్థానిక ప్రజాప్రతినిధులను చంపేస్తానని బెదిరించిన సదరు మాజీ.. ఇప్పటికీ తన తీరు మార్చుకోలేదని పలువురు అంటున్నారు. అతడి కారణంగా ఓ సర్పంచ్ దంపతులు జైలుపాలైన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజలు ఎన్నికల్లో ఈడ్చికొట్టిన ఇన్నాళ్లకైనా కేసీఆర్ గెంటేయడం పార్టీకి మేలు చేస్తుందని జిల్లా పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి.

ఆర్మూర్‌లో జూనియర్ కళాశాల సీజ్

- అనుమతులు ఒకచోట.. నిర్వహణ మరోచోట
- అయోమయంలో 800 మంది విద్యార్థులు



జూనియర్ కళాశాల కొనసాగిన భవనం

ఆర్మూర్: నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో ఉన్న ఓ భవనంలో కొనసాగుతున్న క్షత్రియ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈవో) రవికుమార్ గురువారం సీజ్ చేశారు. విద్యార్థులను ఇళ్లకు పంపించి యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ఆ భవనంలో కళాశాలను నిర్వహణకు మూడేళ్ల క్రితం ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులను నిరాకరించింది. దీంతో క్షత్రియ జూనియర్ కళాశాల యాజమాన్యం ఆర్మూర్ మండలం చేపూర్ శివారులోని క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో కళాశాల నిర్వహణకు అనుమతులు తీసుకున్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న భవనంలోనే తరగతులను నిర్వహిస్తూ వస్తున్నారు. సుమారు 500 మంది బాలబాలికలు ఇదే భవనంలోని పై అంతస్తుల్లో హాస్టల్‌లో ఉంటుండగా, మరో 300 మంది విద్యార్థులు డే స్కాలర్స్‌గా చదువుకుంటున్నారు. మరో ప్రైవేట్ కళాశాల యజమాని క్షత్రియ జూనియర్ కళాశాలపై అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతోపాటు విలేకరుల సమావేశం నిర్వహించి నిబంధనలను అతిక్రమించిన తీరును వివరించారు. స్పందించిన అధికారులు కళాశాలను సందర్శించి సీజ్ చేసి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అడ్మిషన్ తీసుకున్న సుమారు 800 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఏం చేయాలో పాలుపోక అయోమయానికి గురవుతున్నారు. మూడేళ్లకు పైగా నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నా తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించిన అధికారుల తీరుపై పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

మళ్లీ సెప్టెంబర్‌లో..

- మూడు నెలల రేషన్ కోటా జూన్‌లోనే పంపిణీ
- బియ్యం అందుకున్న 96.99శాతం కార్డుదారులు
- తహసీల్ కార్యాలయాలకు బోగస్ పేర్ల జాబితా
- నూతన కార్డులు, పేర్ల నమోదుకు అందుతున్న దరఖాస్తులు



నగరంలో బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

రేషన్ దుకాణాలు	759
ఆహార భద్రత కార్డులు	4,03,510
లబ్ధిదారులు	13,32,864

సుభాష్‌నగర్: వర్షాకాలం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు మూడు నెలలకు సంబంధించి రేషన్ బియ్యం పంపిణీని జూన్‌లోనే పూర్తిచేశారు. నెలరోజులపాటు అందుబాటులో ఉండి కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. ఈ మేరకు డీలర్లు నెలరోజుల్లో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి 96.99శాతం కార్డుదారులకు సుమారు 25,190 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేశారు. మళ్లీ సెప్టెంబర్‌లోనే రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నారు.

మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తారని ఓ వైపు ప్రకటించడంతోపాటు ఒక్క నెలలోనే 1,293 కొత్త కార్డులు జారీ చేశారు.

25,190 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ

కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు జిల్లాలో 25,190 మెట్రిక్ టన్నుల బియ్యం 759 రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి మూడు నెలల బియ్యం 18 కిలోల చొప్పున అందజేశారు. జూన్ నెల మొత్తం రేషన్‌డీలర్లు దుకాణాలు తెరిచి ఉంచి 96.99శాతం పంపిణీ పూర్తిచేశారు. 3,78,095 మంది కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయగా, 25,415 మంది కార్డుదారులు బియ్యం తీసుకోలేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. బియ్యం పంపిణీ సమయంలో కార్డుదారులు మూడుసార్లు వేలిముద్రలు వేయాల్సి ఉండగా, జూన్ మొదటి వారంలో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. కేంద్రప్రభుత్వం ఆ సమస్యలను పరిష్కరించడంతో పంపిణీ ప్రక్రియ సాఫీగా పూర్తయ్యింది.

కొనసాగుతున్న ఏరివేత!

జిల్లావ్యాప్తంగా ఆహారభద్రత కార్డుల్లో బోగస్ పేర్ల (చనిపోయిన, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు, విదేశాలకు వెళ్లిన వారు) ఏరివేత ప్రక్రియ కొనసాగుతోంది. సుమారు 9వేల మంది ఉన్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు జాబితాను తహసీల్ కార్యాలయాలకు పంపించారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బోగస్ పేర్లను తొలగించనున్నారు.

18,399 మంది లబ్ధిదారులు కొత్తగా చేరారు. ప్రస్తుతం కొత్త కార్డులు, పేర్లను నమోదు చేసేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మీసేవ ద్వారా కొనసాగుతోంది. వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. పేర్లు చేర్పు కోసం 19వేలు, కొత్త కార్డుల కోసం 14,500 వరకు దరఖాస్తులు వచ్చినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. నిత్యం వందల సంఖ్యలో జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి దరఖాస్తుదారులు తరలివస్తున్నారు.

సమస్య లేకుండా పంపిణీ



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు జిల్లాలోని 759 రేషన్‌షాపుల ద్వారా రేషన్ పంపిణీ చేపట్టాం. 96.99 శాతం మందికి సన్నబియ్యం పంపిణీ పూర్తయ్యింది. మళ్లీ సెప్టెంబర్‌లోనే రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేపడుతాం. కొత్త కార్డులు, పేర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

– అరవింద్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

ముహూర్తమెన్నడో..?

- తెయూలో బాలికల నూతన హాస్టల్ భవనానికి రూ.7 కోట్లు మంజూరు
- పూర్తయిన టెండర్ ప్రక్రియ
- ఇప్పటికీ ప్రారంభం కాని పనులు



తెయూ మెయిన్ క్యాంపస్‌లోని బాలికల హాస్టల్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో బాలికల నూతన హాస్టల్ నిర్మాణ పనులకు ముహూర్తం కుదరడం లేదు. నూతన గరల్స్ హాస్టల్ నిర్మాణం కోసం రూ.7కోట్ల రూసా నిధులు అందుబాటులో ఉన్నా, నిర్మాణ పనులకు మోక్షం లభించడం లేదు. తెయూ మెయిన్ క్యాంపస్‌లో బాలురకు రెండు హాస్టల్స్ ఉండగా, బాలికలకు మాత్రం ఒకే హాస్టల్ ఉంది. బాలుర రెండు హాస్టల్స్‌లో కలిపి 447 మంది ఉండగా, బాలికలకు ఉన్న ఒక్క హాస్టల్‌లోనే 440 మంది బాలికలు ఉంటున్నారు. దీంతో బాలికలు ఒకే గదిలో 6నుంచి 8మంది ఉండాల్సి రావడంతో బాలికలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

2022లో యూజీసీ ఆదేశం

వర్సిటీ క్యాంపస్‌లో బాలురు, బాలికలకు సరిపడా నూతన హాస్టల్స్ నిర్మించాలని యూజీసీ 2022 నవంబర్‌లో ఆదేశాలు జారీ చేసింది. రెండున్నరేళ్లు కావొస్తున్నా హాస్టల్ నిర్మాణానికి ఇప్పటికీ అడుగు ముందుకు పడటం లేదు. గత విద్యాసంవత్సరం మేలో తెలంగాణ యూనివర్సిటీకి రూ.8.60 కోట్ల రూసా నిధులు మంజూరయ్యాయి. ఇందులో రూ.7కోట్లు నూతన బాలికల హాస్టల్ నిర్మాణానికి, ఫుట్‌పాత్ నిర్మాణానికి రూ.కోటి, కంప్యూటర్ సైన్స్ కాలేజీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షలు వెచ్చించాల్సి ఉంది. టెండర్ పూర్తయినప్పటికీ సదరు కాంట్రాక్టర్ టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ (తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ ఉమెన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)తో అగ్రిమెంట్ చేసుకోక పోవడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా వర్సిటీ వీసీ, ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్ నిర్మాణం వెంటనే చేపట్టాలని విద్యార్థినులు కోరుతున్నారు.

త్వరలో పనులను ప్రారంభించేందుకు కృషి



తెయూలో బాలికల నూతన హాస్టల్ భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీ టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీతో కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంది. కానీ అగ్రిమెంట్ కాకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది. ఈ విషయమై సదరు కాంట్రాక్టర్‌తో వీసీ యాదగిరిరావు మాట్లాడారు. వీలైనంత త్వరగా హాస్టల్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం.

– యాదగిరి, రిజిస్ట్రార్, తెలంగాణ యూనివర్సిటీ

రోత పుట్టిస్తున్న రోడ్లు

- నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో అధ్వానంగా పరిస్థితులు
- భారీ గుంతలు.. కనిపించని కల్వర్టులు
- నగర ప్రజలకు తప్పని ఇబ్బందులు

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివాస గృహాల సంఖ్య వేగంగా పెరుగుతోంది. నలుదిశలా కాలనీలు విస్తరిస్తున్నాయి. ఇప్పటికే తొమ్మిది గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. అయితే ఆయా ప్రాంతాలను కలిపే రోడ్లు మాత్రం రోతపుట్టిస్తున్నాయి. కార్పొరేషన్ పరిధిలో రోడ్ల పరిస్థితి మెరుగుపడడం లేదు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం రోడ్లు 914 కిలో మీటర్ల మేర ఉండగా.. ఇందులో ఆర్‌అండ్‌బీ రోడ్లు 55 కిలో మీటర్లు, సీసీ రోడ్లు 415 కిలోమీటర్లు, బీటీ రోడ్లు 148 కిలోమీటర్లు, గ్రావిటీ రోడ్లు 296 కిలో మీటర్ల మేర ఉన్నాయి.



ఆటోనగర్‌లోని ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలు.. నిలిచిన వర్షపునీరు

సాక్షి ఫోకస్ · కార్పొరేషన్ కహానీ - 3



శ్రీనగర్‌కాలనీలో గుంతలమయమైన రోడ్డు

రోడ్లు లేక ఇబ్బందులు..

60 డివిజన్ పరిధిలో 4లక్షల 30వేల జనాభా ఉండగా రోడ్లు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రోడ్లపై మురికి నీరు నిలుస్తోంది. శివారు ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ముబారక్ నగర్, మారుతినగర్, లక్ష్మీప్రియనగర్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతుండగా రోడ్ల వసతి మాత్రం లేదు. ధర్మపురి హిల్స్, నిజాంకాలనీ, వెంగళరావునగర్ కాలనీ, నాగారం, ఆటోనగర్, మాలపల్లి ప్రాంతాల్లో సైతం నేటికీ రోడ్ల వసతి సక్రమంగా లేదు. సీసీ రోడ్లు ఉన్న చాలా ప్రాంతాల్లో లింక్‌రోడ్లు మట్టివి ఉన్నాయి. వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లు సరిగా లేక రాత్రి వేళలో వీధి దీపాలు వెలగకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారినపడుతున్నారు. మాలపల్లి, ధర్మపురి హిల్స్, అర్సపల్లి, చంద్రశేఖర్‌కాలనీ, గౌతమ్‌నగర్, దుబ్బ ప్రాంతాల్లో పరిస్థితి అధ్వానంగా మారుతోంది. చంద్రశేఖర్ కాలనీ, వివేకానంద నగర్ కాలనీల్లో ఇప్పటికీ మట్టి రోడ్లే ఉన్నాయి.

■ ఇది ముబారక్‌నగర్ ప్రాంతంలోని పెద్దమ్మతల్లి ఆలయం నుంచి లక్ష్మీప్రియనగర్, గంగస్థాన్ వెళ్లే ప్రధాన రోడ్డు. ప్రతి రోజూ అనేకమంది వాహనదారులతోపాటు కాలినడకన వెళ్లేవారు రాకపోకలు సాగిస్తుంటారు. మట్టిరోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి ఉంది. గతంలో అనేకసార్లు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదనిస్థానికులు అంటున్నారు.





మారుతినగర్‌లోని రోడ్డుపై గుంతలు

రోడ్లు నిర్మించాలి



అధికారులు స్పందించి రోడ్డు లేని ప్రాంతాలలో రోడ్లు నిర్మించాలి. పన్ను వసూలు చేసే మున్సిపల్ అధికారులు రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను పట్టించుకోవడం లేదు. పరిస్థితిలో మార్పు రావాలి. – పండరి, కోటగల్లి

ప్రతి వర్షాకాలంలో ఇబ్బంది



ప్రతి వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. మట్టి రోడ్ల గుండా నడవలేక పోతున్నాం. వాహనాలు వెళ్లలేకపోతున్నాయి. చీకట్లో మరింత ఇబ్బంది పడుతున్నాం. రోడ్లు నిర్మిస్తే ఎంతో బాగుంటుంది.

– సంతోష్, ముబారక్‌నగర్

క్లుప్తంగా

జగన్నాథుడి రథయాత్ర విజయవంతం



బోధన్‌: బోధన్‌ ఇస్కాన్‌ భక్తి కేంద్రం అధ్వర్యంలో జూన్‌ 30న తొలిసారి పట్టణంలో నిర్వహించిన జగన్నాథుడి రథయాత్ర సంపూర్ణ విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు పట్టణంలోని ఇస్కాన్‌ భక్తి కేంద్రంలో గురువారం ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రథయాత్ర విజయవంతంపై భక్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతాభినందనలు తెలిపారు. ఏసీపీ శ్రీనివాస్‌, టౌన్‌ సీఐ వెంకట నారాయణ, టీపీసీసీ డెలిగెట్‌ గంగాశంకర్‌, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మాజీ కౌన్సిలర్‌ దాము, తాలూకా రైస్‌మిల్లర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సాంబిరెడ్డి, మారుతి మందిరం అర్చకులు ప్రవీణ్‌ మహరాజ్‌, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

బిల్లుల అవకతవకలపై చర్యలు తీసుకోవాలి



తెయూ(డిచ్‌ పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మెయిన్‌ క్యాంపస్‌లోని బాలికల, బాలుర (పాత, కొత్త) హాస్టల్స్‌ మెస్‌ బిల్లులలో అవకతవకలు జరిగాయని వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు సాయికుమార్‌ ఆరోపించారు. ఈమేరకు గురువారం ఆయన హాస్టల్‌ విద్యార్థులతో కలిసి చీఫ్‌ వార్డెన్‌ కార్యాలయానికి వెళ్లి సంబంధిత అధికారులను నిలదీశారు. విద్యార్థులకు వచ్చే బిల్లుకు, నోటీసు బోర్డులో అతికించే బిల్లుకు మధ్య తేడాలను విద్యార్థులు గమనించి, ఏబీవీపీ దృష్టికి తీసుకువచ్చారన్నారు. బిల్లుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం వీసీ యాదగిరి రావు వద్దకు వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వీసీ వారికి హామీ ఇచ్చారు. ఏబీవీపీ స్టేట్‌ వర్కింగ్‌ కమిటీ మెంబర్‌ అమత్‌చారి, నాయకులు సమీర్‌, అక్షయ్‌, పృధ్వీ, మనోజ్‌ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజీవాడిలో అదనపు కలెక్టర్‌ పర్యటన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడిలో గురువారం అదనపు కలెక్టర్‌ చందర్‌ నాయక్‌ పర్యటించారు. మూడు రోజుల క్రితం గ్రామ కార్యదర్శి చంద్రకళ ప్రజల నుంచి ఇంటి పన్నులతో పాటు మిషన్‌ భగీరథ బిల్లులను వసూల్‌ చేశారు. దీంతో గ్రామస్తులు కొన్ని సంవత్సరాల నుంచి మిషన్‌ భగీరథ బిల్లలను చెల్లించలేదని, ఇప్పుడు ఎందుకు వసూల్‌ చేస్తున్నారని కార్యదర్శిని అడుగడమే కాకుండా పై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై అదనపు కలెక్టర్‌ చందర్‌ నాయక్‌ గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. గ్రామకార్యదర్శులు, మిషన్‌ భగీరథ అధికారులు, గ్రామప్రజలు చెప్పిన విషయాలను అదనపు కలెక్టర్‌ విన్నారు. ఈ సమస్యలను కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. అప్పటి వరకు మిషన్‌ భగీరథకు బిల్లులను వసూల్‌ చేయవద్దని అధికారులకు సూచించారు. డీపీవో మురళీ, ఎంపీడీవో సయ్యద్‌ సాజీద్‌అలీ, ఏఈలు ప్రశాంత్‌, శిరీష, ఎంపీవో సవిత, గ్రామకార్యదర్శులు చంద్రకళ, బాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాలు చేసుకునేదెలా?



నవీపేటలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



ప్రవేశ ద్వారం వద్ద మురికి కూపం

- అధ్వానంగా టీటీడీ కల్యాణ మండపాలు
- కనీస వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు

నవీపేట: ప్రజలకు తక్కువ ధరలో ఫంక్షన్‌హాల్‌ సౌకర్యం కల్పించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మారుమూల గ్రామాలలో టీటీడీ కల్యాణ మండపాలను నిర్మించింది. కానీ మండపాల నిర్వహణను ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం అధ్వానంగా మారాయి. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతోపాటు మండపాల పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో ఎవరూ కూడా టీటీడీ కల్యాణ మండపాల్లో శుభకార్యాలు నిర్వహించడం లేదు.

ఇదీ పరిస్థితి..

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిజామాబాద్‌ నగరంలో రెండు కల్యాణ మండపాలు, నవీపేట, ఆర్మూర్‌, బాల్కొండ, ధర్పల్లిలో ఒక్కొక్కటి చొప్పున కొన్నేళ్ల క్రితం నిర్మించారు. వీడీసీల ప్రోత్సాహంతో నిరుపేదలకు ఆసరాగా నిలవాలని అన్ని ఏర్పాట్లతో నిర్మించారు. కానీ నిర్మించిన కల్యాణ మండపాలపై పాలకవర్గం చిన్నచూపు చూస్తోంది. ఏళ్ల కిందట నిర్మించిన మండపాలకు మరమ్మతులు కరువవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నవీపేట, బాల్కొండలలోని మండపాల చుట్టూ ఉన్న ప్రహరీలు కూలాయి. ఆర్మూర్‌, ధర్పల్లిలలో తాగునీటి సమస్య ఉంది. ఆర్మూర్‌లో పలుమార్లు బోరుబావుల తవ్వకం జరిపిన ఫలించలేదు. తరచూ సమస్యలు రావడంతో జిల్లా కేంద్రంలోని రెండు మండపాలను ప్రయివేట్‌ వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. నవీపేటలోని మండపంలో పార్కింగ్‌ కోసం ఏర్పాటు చేసిన ఆవరణలో ఇటీవల కురిసిన వర్షపు నీరు నిలిచి చెరువులను తలపింపజేస్తున్నాయి. ఆధునిక సౌకర్యాలతో ప్రయివేట్‌ వ్యక్తులు ఫంక్షన్‌హాల్‌లను నిర్మించడంతో టీటీడీ కల్యాణ మండపాల వినియోగం తగ్గింది. తక్కువ ధరే అయినా సౌకర్యాల లేమి కారణంగా ఔత్సాహికులకు నిరాశ కలిగిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టీటీడీ కల్యాణ మండపాలను ఆధునికీకరించడంతోపాటు తగిన సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



భవనానికి ఏర్పడిన పగుళ్లు

ప్రతిపాదనలు సిద్ధం చేశాం..

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపాల బాగోగులపై ఇటీవల సమావేశం జరిగింది. మండపాల్లోని సమస్యలను గుర్తించి ప్రతిపాదనలు పంపించమని ఆదేశించారు. డివిజన్‌లోని మండపాలలో నెలకొన్న సమస్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. తాగునీటి సౌకర్యం, ప్రహరీల నిర్మాణం, భవనాల పగుళ్లకు మరమ్మతులు చేపడుతాం.

–రాజేష్‌, నిజామాబాద్‌ డివిజన్‌ టీటీడీ కల్యాణ మండపాల ఇన్‌చార్జి

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు చెల్లించాలి



తెయూలో తరగతులు బంద్‌ చేయించి నినాదాలు చేస్తున్న నాయకులు, విద్యార్థులు



డిచ్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

- పీడీఎస్‌యూ నాయకుల డిమాండ్‌
- కళాశాలల్లో తరగతుల బహిష్కరణ

తెయూ(డిచ్‌పల్లి): మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్‌ బకాయి నిధులను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్‌ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈమేరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టగా గురువారం తెలంగాణ యూనివర్సిటీలో పీజీ కళాశాలల తరగతులు బంద్‌ చేయించారు. అనంతరం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాలల తరగతులు బంద్‌ చేయించి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రాజేశ్వర్‌ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న విద్యార్థులకు ప్రయివేట్‌ యూజీ, పీజీ, ఇంజినీరింగ్‌ కళాశాలలు సర్టిఫికెట్స్‌ ఇవ్వడం లేదన్నారు. దీంతో ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు పేద విద్యార్థులు దూరం అవుతున్నారన్నారు. అలాగే యూనివర్సిటీలలో విద్యార్థులకు మెస్‌ బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించాలని డిమాండ్‌ చేశారు. నాయకులు ప్రిన్స్‌ ప్రిన్స్‌, నిఖిల్‌, హుస్సేన్‌, సాయికిరణ్‌, సాయి, దుర్గాప్రసాద్‌, కల్యాణ్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ ఇన్‌చార్జి ఎక్సైజ్‌ ఎస్‌హెచ్‌వోగా సుస్మిత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎక్సైజ్‌ ఎస్‌హెచ్‌వో దిలీప్‌ ఇటీవల సాలూర చెక్‌ పోస్టుకు బదిలీ అయ్యారు. నగరంలోని ఓ కల్లుడిపోకు చెందిన రెండు కల్లు దుకాణాలను ఈత వనాలు లేనందున ఎక్సైజ్‌ అధికారులు సీజ్‌ చేశారు. ఈ వ్యవహారంలోనే బదిలీ జరిగినట్లు ఎక్సైజ్‌ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఇసుక లారీ పట్టివేత



బోధన్‌: బోధన్‌ నుంచి నిజామాబాద్‌ వైపు అక్రమంగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీని గురువారం పట్టుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. లారీ యాజమాని అజీజ్‌, డ్రైవర్‌ సిరాజ్‌ అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీస్‌ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఎకరానికి ఎంత భూమి..

మీకు తెలుసా?

బాల్కొండ: వ్యవసాయ భూములను ఎకరాల్లో(బిగాల్లో) రైతులు తెలుపుతుంటారు. ఎకరానికి ఎంత భూమి అనే విషయాన్ని కింద తెలుసుకుందాం..

- 40 గుంటలకు ఎకరం అవుతుంది.
- రెండు గుంటలకు ఇసా భూమి అవుతుంది
- 20 ఇసాలకు ఎకరం అవుతుంది
- ఎకరానికి 4840 గజాలు అవుతుంది.
- ఎకరానికి 100 సెంట్లు, గుంటకు 2.5 సెంట్లు
- గుంటకు 121 గజాలు
- ఒక సెంట్‌ భూమికి 48.4 గజాలు



- ఇంటి నిర్మాణాల స్థలాలను ప్లాట్లు అంటారు. ప్లాట్లను గజాల చొప్పున కొనుగోలు చేస్తారు.

ఇందూరు జిల్లా క్రీడాకారులకు పుట్టినిల్లు



తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ

నిజామాబాద్‌నాగారం: ఇందూరు జిల్లా క్రీడాకారులకు పుట్టినిల్లు అని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారులు రాణిస్తూ తెలంగాణలో ఆదర్శంగా నిలుస్తున్నారని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ అన్నారు. తైక్వాండో ఫెడరేషన్‌ అఫ్‌ ఇండియా, తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఇండోర్‌ స్టేడియంలో ఇటీవల 8వ ఓపెన్‌ నేషనల్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు నిర్వహించారు. పోటీల్లో జిల్లాకు చెందిన 38 మంది క్రీడాకారులు మెడల్స్‌ సాధించగా గురువారం ఎమ్మెల్యే వారిని మెడల్స్‌తో సత్కరించి అభినందించారు. అలాగే కోచ్‌ మనోజ్‌ను అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా జాతీయస్థాయిలో 24 గోల్డ్‌ మెడల్స్‌, 11 సిల్వర్‌ మెడల్స్‌, 3 కాంస్య పతకాలు సాధించడం ఇందూరు జిల్లాకే గర్వకారణమన్నారు. క్రీడలతోపాటు విద్యలో కూడా రాణించాలని, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని క్రీడాకారులకు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేలా వారికి అండగా ఉంటానని, జిల్లాలో ఇండోర్‌ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడల్లో నిరంతర సాధనతోనే విజయం సాధ్యం

నిజామాబాద్‌నాగారం: క్రీడాకారులు ప్రతినిత్యం క్రీడల్లో సాధన చేస్తేనే పోటీల్లో విజయం సాధిస్తారని జిల్లా యువజన క్రీడల అధికారి పవన్‌ కుమార్‌ అన్నారు. నిజామాబాద్‌ జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నాగారంలోని రాజారం స్టేడియంలో అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు నిర్వహించగా, గురువారం విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పవన్‌కుమార్‌ హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ క్రీడలు ఆడడం వల్ల చెడు ఆలవాట్లకు దూరంగా ఉంటారన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతినిత్యం క్రీడలు ఆడాలన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను అందజేశారు. జిల్లా ట్రస్మా చీఫ్‌ అడ్వైజర్‌ మామిడాల మోహన్‌, టీచర్స్‌ యూనియన్‌ బీసీ నాయకులు మురళీకృష్ణ, అసోసియేషన్‌ సభ్యులు మధు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలు వీరే.. బాలుర విభాగంలో.. మొదటి ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ మహాత్మ జ్యోతిబాపూలే మోర్తాడ్‌ జట్టు కైవసం చేసుకుంది. రెండో చాంపియన్‌షిప్‌ క్షత్రియ పాఠశాల పెర్కిట్‌ అందుకుంది. మూడో చాంపియన్‌షిప్‌ సిద్ధార్థ పాఠశాల నందిపేట్‌ సాధించింది. బాలికల విభాగంలో.. మొదటి చాంపియన్‌షిప్‌ కేజీబీవీ సిరికొండ సాధించింది. రెండో చాంపియన్‌షిప్‌ విజయ హైస్కూల్‌ నిజామాబాద్‌ అందుకుంది. మూడో చాంపియన్‌షిప్‌ విద్యా హైస్కూల్‌ డిచ్‌పల్లి కైవసం చేసుకుంది.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎస్‌వో పవన్‌కుమార్‌

క్రైం కార్నర్‌

అత్తను హతమార్చిన అల్లుడు

- ఇచ్చిన రూ.లక్ష తిరిగి ఇవ్వాలని అడిగినందుకు ఘాతుకం



లక్ష్మి (ఫైల్‌)



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిట్లం(జుక్కల్‌): రూ.1లక్ష కోసం అత్తను అల్లుడు హతమార్చిన ఘటన పిట్లం మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి(43)కి భర్త, కుమారుడు, కూతురు స్వప్న ఉన్నారు. స్వప్నకు అదే గ్రామానికి చెందిన బాగరాజుతో ఏడేళ్ల క్రితం వివాహం అయింది. ఈక్రమంలో లక్ష్మి కొన్ని నెలల క్రితం అల్లుడు అయిన బాగరాజుకు లక్ష రూపాయలను ఇచ్చింది. బాగరాజు ఇటీవల సాగు చేసిన జొన్న పంటను తన పేరుపై కొద్దిగా, అత్త లక్ష్మి పేరున కొద్దిగా విక్రయించాడు. దీంతో ఇద్దరి బ్యాంకు ఖాతాలలో జొన్నలు విక్రయించిన డబ్బులు పడ్డాయి. దీంతో లక్ష్మి అల్లుడికి గతంలో ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వమని అడిగింది. ఈ విషయంపై గురువారం ఉదయం ఇద్దరి మధ్య గొడవ జరుగగా, గ్రామస్తులు సర్ది చెప్పారు. అనంతరం లక్ష్మి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండటానికి వెళ్లి, మధ్యాహ్నం ఇంటికి బయలుదేరింది. మార్గమధ్యలో ఆమెను బాగరాజు అడ్డగించి కమ్మకత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలు కావడంతో లక్ష్మి అక్కడిక్కడే మృతి చెందింది. బాగరాజు తన అత్తను చంపేశాను పోలీసులకు లొంగిపోతున్న అని గ్రామ మాజీ సర్పంచ్‌కు సమాచారం ఇచ్చాడు. వెంటనే మాజీ సర్పంచ్‌, గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని చూడగా ఆమె అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి కుమారుడు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్నేహితుల మృతి
- మూడు కుటుంబాల్లో తీరని విషాదం



వెంకటి(ఫైల్‌)



గణేశ్‌(ఫైల్‌)



నవీన్‌(ఫైల్‌)



నుజ్జునుజ్జయిన పల్సర్‌ బైక్‌

నిజాంసాగర్‌: ముగ్గురు స్నేహితులు ఒక బైక్‌పై కలిసి వెళ్లగా, ఘోర రోడ్డు ప్రమాదంలో మృత్యువాతచెందారు. పెద్దకొడప్‌గల్‌ మండలం జగన్నాథపల్లి వద్ద గల సంగారెడ్డి–నాందేడ్‌ 161 జాతీయ రహదారిపై జరిగిన ఘటన వివరాలు ఇలా.. జుక్కల్‌ మండలం మహమ్మదాబాద్‌ గ్రామానికి చెందిన పోనుగంటి వెంకటి(22), మంగళి గణేశ్‌(18), బిచ్కుందకు చెందిన దొడ్లవార్‌ నవీన్‌(24) ముగ్గురు స్నేహితులు. గణేశ్‌ మూడు నెలల కిందట పల్సర్‌ బైక్‌ కొనుగోలు చేశాడు. బుధవారం సాయంత్రం వారు ముగ్గురు కలిసి బైక్‌పై పిట్లంకు వెళ్లారు. రాత్రి వేళ ముగ్గురు స్నేహితులు బైక్‌పై నాందేడ్‌–సంగారెడ్డి జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా.. అప్పటికే రోడ్డు ప్రమాదానికి గురై, నిలిచి ఉన్న కంటెయినర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో ముగ్గురి తలలు పగిలి తీవ్ర రక్తస్రావం జరుగగా, ఇద్దరు ఘటన స్థలంలో మృతిచెందారు. ఒకరు మార్గమధ్యలో మృతి చెందారు. సమాచారం అందుకున్న జాతీయరహదారి సిబ్బంది,పోలీసులు మృతదేహాలను అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జుక్కల్‌ మండలం మహమ్మదబాద్‌ గ్రామానికి చెందిన పోనుగంటి సాయవ్వ–గంగారాం దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నకుమారుడైన వెంకటి ఇంటర్‌ వరకు విద్యను అభ్యసించాడు. తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడు, వాదోడుగా ఉన్నాడు. అలాగే అదే గ్రామానికి చెందిన మంగళి హన్మండ్లు–లక్ష్మీబాయి దంపతుల పెద్ద కుమారుడు గణేశ్‌ నిజామాబాద్‌లో ఇంటర్‌ చదువుతున్నాడు. బిచ్కుంద పట్టణానికి చెందిన దొడ్లవార్‌ నాందేవ్‌–శోభ దంపతుల కుమారుడు నవీన్‌. వీరు ముగ్గురు స్నేహితులు కాగా, చేతికొచ్చిన కుమారులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

కలుపు నివారణకు మందులు పిచికారీ చేయాలి

మద్నూర్‌: సోయా పంటలో గడ్డి జాతి కలుపు నివారణకు రైతులు రసాయన మందులు పిచి కారీ చేయాలని ఏవో రాజు అన్నారు. గురు వారం ఆయన వాడి, ఫతేపూర్‌, మద్నూర్‌ తదితర గ్రామాల్లో సాగవుతున్న సోయా పంటల ను పరిశీలించి పలు సూచనలు చేశారు. గడ్డిజాతి కలుపు నివారణకు క్విజాలాఫాఫ్‌ ఈథైల్‌ 40 ఎంఎల్‌ లేదంటే ప్రొపాక్విజాపాప్‌ 250ఎంఎల్‌ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వెడల్పాటి ఆకు ఉన్నట్లయితే ఇమజిత్‌పెర్‌ 400 ఎంఎల్‌ పిచికారీ చేయాలన్నారు.అలాగే గడ్డిజాతి,వెడల్పాటి ఆ కు ఉన్నట్లయితే క్విజాలోపాప్‌ పిఈథైల్‌,ఇమాజిత్‌పెర్‌ 200 ఎంఎల్‌ మందును ఉదయం పూట గాలి వర్షం లేని సమయంలో భూమిలో తేమ ఉన్న సమయంలో పిచికారీ చేయాలన్నారు.

వాహనాల తనిఖీ

నిజాంసాగర్‌(జుక్కల్‌): పెద్దకొడప్‌గల్‌ మండలంలోని అంజనీ చౌరస్తా జాతీయ రహదారి–161పై గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్‌ మాట్లాడుతూ.. మద్యం తాగి, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్‌ చేస్తున్నప్పుడు మొబైల్‌ వాడకం, సీట్‌ బెల్ట్‌ పెట్టుకోకపోవడం, లైసెన్స్‌ లేకుండా నడుపుతున్నట్లు తెలిస్తే వాహనాలు సీజ్‌తోపాటు లైసెన్స్‌ రద్దు చేస్తామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు నాలుగో టౌన్‌ పోలీసులు తెలిపారు. గత నెల 25న నగరంలోని బింగి ఫంక్షన్‌ హాల్‌ సమీపంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో పడిఉండగా, పోలీసులు గుర్తించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో గురువారం అతడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60ఏళ్ల లోపు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు షర్ట్‌, లుంగీ ధరించినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసినచో నాలుగవ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో గాని, 87126 59840, 87126 59719ను సంప్రదించాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న లారీ

- డ్రైవర్‌ మృతి

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కంఠేశ్వర్‌ బైపాస్‌ వద్ద రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఓ లారీ ఢీకొనడంతో డ్రైవర్‌ మృతిచెందాడు. వివరాలు ఇలా.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పర్వేజ్‌ఖాన్‌ (32) ఆదిలాబాద్‌లోని కేటీపీ ట్రాన్స్‌పోర్ట్‌ కంపెనీలో గత ఐదేళ్లుగా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నగరంలోని కంఠేశ్వర్‌ బైపాస్‌లోగల లహరి హోటల్‌ పక్కన ఓ భవననిర్మాణం కొనసాగుతుండగా మంగళవారం అతడు లారీలో సిమెంట్‌ లోడ్‌ను తీసుకువచ్చాడు. ప్రమాదవశాత్తు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను లారీ ఢీకొనడంతో డ్రైవర్‌ పర్వేజ్‌ఖాన్‌ మృతిచెందాడు. మృతుడి సన్నిహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో ఆరీఫ్‌ గురువారం తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌ కేసులో ఒకరికి జైలు

రెంజల్‌(బోధన్‌): మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌ తనిఖీలు చేపట్టగా, వీరన్నగుట్ట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరుపర్చారు. బోధన్‌ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి శేషతల్ప సాయి అతడికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై చంద్రమోహన్‌ తెలిపారు.

పశువుల అక్రమ రవాణా కేసులో..

రుద్రూర్‌: మండలంలో ఏప్రిల్‌ 16న పోలీసులు తనిఖీలు చేపట్టగా నాందేడ్‌ జిల్లాకు చెందిన షేక్‌ అతిక్‌, షేక్‌ సోహైల్‌, షేక్‌ ఆవేజ్‌లు నాలుగు ఎద్దులను అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేసి, గురువారం బోధన్‌ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి శేషతల్ప సాయి విచారణ చేపట్టి, నిందితులకు ఒక రోజు జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై సునీల్‌ తెలిపారు.

విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొన్న రోడ్డు రోలర్‌

- స్తంభం విరిగినా వైర్లు తెగకపోవడంతో తప్పిన ప్రమాదం

నస్రుల్లాబాద్‌: మండలంలో కొద్దిరోజులుగా 765 డి జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో గురువారం దుర్కి గ్రామ ప్రధాన రహదారిపై రోడ్డు రోలర్‌తో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగిపోయింది. విద్యుత్‌ తీగలు తెగిపడకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఒకవేళ విద్యుత్‌ తీగలు తెగి వాహనంపై పడినా.. లేదా రోడ్డుపై వెళుతున్న వాహనదారులపై పడిన ప్రాణాపాయం జరిగేదని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్తంభం విరిగినా కూడా తృటిలో పెను ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులు కొత్త స్తంభం వేయించి సరిచేసి ఇస్తానని అధికారులు తెలపడంతో గ్రామానికి ప్రత్యామ్నాయం మార్గం ద్వారా విద్యుత్‌ సరఫరా చేశారు.



వివాహిత ఆత్మహత్య

నిజామాబాద్‌రూరల్‌: రూరల్‌పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. రూరల్‌ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్‌ తెలిపిన వివరాలు ఇలా.. నగర శివారులోని బైపాస్‌ రోడ్డు పక్కన గల ఓ అపార్ట్‌మెంట్‌లో దంపతులైన శెట్టితేజ(42), శెట్టి శ్రీనివాస్‌ జీవిస్తున్నారు. కొద్దిరోజులుగా ఇరువురి మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన శెట్టి తేజ గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కొడుకు అర్వింద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.